# తిమింగలం వేట

సృజన ఎదురుగా ఉరకలేస్తున్న సముద్రపు పెయింటింగ్ ఉంది. గుండెల్లోంచి సముద్రపు హోరు.... పోటెత్తిన సముద్రం వెర్రెత్తినట్లు ఎగిసి ముందుకు దూకినట్లు. మనసులోంచి 'అవుతుందా...?..... అవుతుందా?....! మళ్ళీ సముద్రపు అల వెనక్కి ముడుచుకొన్నట్లు 'కాదేమో.... కాదేమో?....!

నురగతో సహా సముద్రపు నీళ్ళు లోపలికి పీల్చేస్తున్నట్లయి దాహం వేసింది సృజనకు. తలతిప్పి అటూ ఇటూ చూసింది. పెద్ద పెద్ద మీసాలున్న సెక్యూరిటీ ఆఫీసర్ డోర్ దగ్గర నిఠారుగా నిలబడి బయట గేటు లోంచి లోపలికి వస్తున్న కారు వంక చూస్తున్నాడు. సృజనకు కారు పై భాగం వెండి రంగులో జిగ్ జిగ్ మంటూ కనిపించింది. కారులోంచి ఒకాయన దిగాడు. సెక్యూరిటీ మీసాలు తలుపు తెరిచి టిక్‌టాక్ మంటూ సెల్యూట్ కొట్టాడు. నిఖార్సయిన బానిస వినయం. కారు దిగినతను ఈ విషయం సంతృప్తి చూపులతో వ్యక్తపరిచి అందరూ తనను గమనిస్తున్నారనే ఒక అవగాహనతోనే ఎవ్వరి వేపూ కన్నెత్తకుండా మెట్లెక్కి వచ్చాడు. సెల్ మోగింది. చేతిలో సెల్‌ని విసుగ్గా చూసి వినటం మొదలుపెట్టాడు. నల్లని సెల్‌ఫోన్‌పై తెల్లని అతగాడి గోళ్ళు మెరుస్తున్నాయి. సృజన తన చేయి వైపు చూసుకొంది. టెన్షన్‌తో కొరుక్కుని కొరుక్కొనీ గోళ్లు అస్తవ్యస్తంగా చిగుళ్ళు ఎగుడుదిగుడుగా ఉన్నాయి. పొద్దునే అంట్లు తోమినప్పుడు అతుక్కున్న నల్లదనం పగుళ్ళ గీతలు స్పష్టంగా చూపెడుతోంది. చేయిలాక్కుని చున్నీ కింద దాచుకొంది. ఇస్త్రీ మడతలు పోకుండా పొందికగా కూర్చుంది కనుక తనూ బొమ్మలాగానే కనిపిస్తూ ఉంటుంది అనుకొంది సృజన. సెక్యూరిటీ మీసాలు 'నువ్వు అడిగింది ఈయన్నే' అన్నట్లు కళ్ళు ఎగరేసి చూపించాడు. కారు దిగినాయన రెండు అడుగులు పక్కకు వేసి రిసెప్షనిస్ట్ ముందున్న టేబుల్ మీద ఆనుకొన్నట్లు కూర్చున్నాడు.

తను ఆయన వేపు నోరు తెరుచుకొని చూస్తున్నానేమో అనిపించింది. సృజనకు. 'కాస్సేపు ఏదేనా ఆలోచిస్తే'... ఏదేనా చూస్తే.... మళ్ళీ దిక్కులు చూసింది.

సెంట్రల్ ఎ.సి. గనుక ఆ హాలు చల్లగా ఉంది. రిసెప్షనిస్ట్ చుట్టూ గోడ కట్టినట్లు టేబుల్ అంచుమీద ఫోన్లు.... కంప్యూటర్.... ఫోన్ నెంబర్లు నోట్ చేస్తున్న లాంగ్‌బుక్.

పుడుతూనే 'కేర్' మనటం కూడా ఇంగ్లీషులోనే మొదలుపెట్టినంత పోష్‌గా... నాజూగ్గా ఫోన్‌కాల్స్ అతి మెత్తని స్వరంతో రిసీవ్ చేసుకొంటోంది ఆ అమ్మాయి. హటాత్తుగా సృజనకు ఆ అమ్మాయి చాలా బావుందని తట్టింది. ఆ అమ్మాయి ముందు తను తేలిపోయిందేమో తన వంక చూసుకోబోయింది. వళ్ళో సర్టిఫికెట్స్ ఫైల్ కూడదు. కూడదన్నట్లు కదిలింది. మొగ్గలోంచి రేకు విడినట్లు సృజన పెదవుల్లోంచి సన్నని నవ్వు వచ్చింది. సృజన వెన్నెముక నిఠారుగా లేపి సరిగ్గా కూర్చుంది.

అయితే గియితే ఈ ఇంటర్వ్యూ ఓ.కె. అయితే తాను ఈ ఆఫీస్ ఇన్‌ఛార్జి అయిపోతోంది. అప్పుడీ మీసాలు, ఈ టెక్కుటిక్కు పిల్ల తనని 'మేడమ్' అని అతి వినయంగా పిలుస్తారు. ఈ సెల్లు కళ్ళెగరేసి హలో అన్నట్లు హావభావ ప్రదర్శన చేస్తాడు. కానీ ఇంతకీ తిమింగలం పడాలి కదా?

సృజన తల పైకెత్తి మళ్ళీ సముద్రం వైపు చూసింది. ఎ.సి. చల్లదనం సముద్రపు తుంపర తగిలినట్లుంది. పడవలో మామూలు వలలూ, ఈటెలూ పట్టుకొని తనేకదా తిమింగలపు వేటకు వెళుతోంది. తన వశమా! ఏమో... పడద్దూ. ఇప్పుడు మటుకు పడవ తుఫాన్ తాకిడికి వణికిపోతూ గజగజ మంటూ అలల వత్తిడికి సయ్యాట లాడుతోంది. పడవ అంచున నిలబడి తను విసిరిన వలలో ఏం పస్తాయి!

"మీ స్లిప్ పంపాను మేడమ్, సార్ పది నిముషాలు వెయిట్ చేయ మంటున్నారు". రిసెప్షనిస్ట్ అతి వినయంగా నాజూకు ఇంగ్లీష్‌లో చెప్పింది.

వల సముద్రం లోంచి రివ్వున బయటకు వచ్చినట్లయింది. వలనిండా మిలమిలా బంగారు రంగు చేపలు. ఉత్సాహంగా వలలోనే గెంతుతున్నాయి. అవి తన చేతికి అందాల్సిన బంగారు కలలు.

ఎగరండి... ఎగరండి....లోపలి నుంచి నాకు పిలుపు రాబోతోంది.... ఈ లోగా బోలెడంత ఉత్సాహం. నోరు తెరచి తాగేయండి... సృజన ఉలిక్కిపడింది... గోడపైన సముద్రం. ఎగరబోతూ ఆగిన అలతో పదిలంగానే ఉంది. చేపల జాడలు లేవు. సృజన మొహం చమటలు పట్టేసింది. తనకు భయం వేస్తే మొహం బిగుసుకు పోతుంది. గోళ్ళు నోట్లోకి వెళ్ళిపోతాయి. కళ్ళు ఎలర్టయి పోయి ఈ గోళ్ళ వ్యవహారం ఎవరేనా కనిపెట్టారేమో నని గబగబా గాలిస్తాయి. ఇప్పుడు అతనయితేనే ఆ దేభ్యం మొహం ఏమిటని ఒక్క అరుపు అరుస్తాడు. రాత్రి ఇలా చూసినందుకే మొహం పైన

బలంగా ఒక దెబ్బకొట్టాడు. నా భర్త.... అబ్బో భర్త...! అబ్బా... ఆ దేభ్యం. దొంగ మొహం... నాకు ఎలర్జీ.... నేను భరించలేకపోతున్నాను. 'ఎందుకు నువ్వు సందేహ పడతావో... ఎందుకు అబద్ధాలు అడతావో అర్ధం కాదు. సరిగ్గా స్థిమితంగా ఎందుకుండవూ?' అన్నాడు మీది మీదికి వచ్చి.

ఎలా వుంటానూ! ఎలా వుండగలనూ? ఈ అభద్రత నా కేరక్టర్. నా శరీరంలో అణువణువూ, రక్తం నిండా ఈ అభద్రతల జ్ఞాపకాలు, మనుష్యులు నాకేం నమ్మకం ఇచ్చారనీ.... పోనీ అదలా వుంచు. దెబ్బకొట్టేముందు నువు ఏం ఇచ్చావో నాకు, కాస్త ఆలోచించుకునయినా చెప్పు. ఉద్యోగం మాంఛిదని నమ్మబలికి, నాన్న జీవితం మొత్తం కూడబెట్టింది ఊడ్చుకొన్నారు. ఇహ నా అవతారం అంటారా? ఆయన నడుం వంగి వంగిపోవటం చూశాకే నా నోట్లోకి గోళ్ళు పోయాయి. రూపాయి రూపాయికీ పొదుపు పాటించి ఇంట్లో మనుష్యులు తిండికి కూడా మొహం వాచిపోయి, పెట్టిన అన్నంతో సరిపుచ్చుకొని మారడగకుండా వేళ్ళు నాక్కోవటం చూశాకే నాకు దేభ్యం మొహం వచ్చింది. బస్సుల్లో వేళ్ళాడుతూ స్కూలుకు పోతున్న రోజుల నుంచే జాకెట్లు తడమటం, వీపులు నొక్కటం అనుభవంలోకి వచ్చాకే నాకు దొంగకళ్ళొచ్చాయి. మరి ఎవరిపైన నమ్మకం పెట్టుకోను. నిజంగానే నిన్నయినా సరే అలా నమ్మేసి నిస్పృహగా నీపైనే వాలిపోయి ఒక్క అరగంటయినా బతకాలని వుంది. ఎక్కడా? ఆ వాలిపోయే మైదానమెక్కడా? కనుచూపుమేరలో అన్నీ ఎడార్లే! ఉద్యోగం కోసం పెళ్ళయిన నెలరోజుల నుంచే ప్రయత్నించడం మొదలుపెట్టానా? లేదా! 'నేనొక్కడ్నే సంపాదించేవాడినవాలి...' అన్న ముక్క తప్పించి ఇంకేం పూసులు చెప్పావు నువ్వు! ఆ సాధింపు వింటూ ఇంటెడు చాకిరీ చేస్తూ, ఆధారపడినందుకు లొంగుతూ అర్ధరాత్రి వరకు ఉక్కలో ఉక్కిరి బిక్కిరి అవటమే నాకు అనుభవంలోకి వచ్చిన నీ సరసం! ఇంక నాది దేభ్యం మొహం అయితే నాకేం నష్టం.... పోనీ నువ్వే.... నీ చిరునవ్వు చాలే సృజనా.... జీవితం నవ్వుల నదిలో పువ్వుల పడవ లాగుందే అనంటే నేను నవ్వుతూ... కులుకుతూ... వెయ్యి ఉద్యోగాలు ఒక్క జీవితంలోనే చేస్తా....ఇప్పుడిహయితే ఈ ఉద్యోగం అచ్చంగా నా కోసం.... నా చేతిలో వాలే పైసలు అచ్చంగా నా కోసమే. నా చదువు, నా తెలివి, నడవడిక నా నవ్వులు అవన్నీ నాకే సంతోషం ఇవ్వాలి. రాత్రుళ్ళూ, పగళ్ళూ తిండీ, నిద్రా లేకుండా నా చదువు ఇందుకే... నువు నాకు పూర్తిగా ఇవ్వని నీ సొంత సంసారాన్ని అడిగి అంది పుచ్చుకోవాలని నాకు లేదు. అందుకే నీ కోసం నాకు నవ్వే రాదు. ఒకవేళ నువు నన్ను చూసి నవ్వినా. వెంటనే ఎందుకో... ఏం పనుందో... అని

లోపల్లోపల నాకు ప్రశ్నలు సంధించే నా మనసుకి వేయగల తాళం తప్ప నా దగ్గర ఏవీ లేదు. అవన్నీ నా ప్రశ్నలే గనుక.

గంట క్రితం ముద్దులాడిన నా మొహంపై నువు దెబ్బలు కొట్టినా, అల్లాగే నువు మురిసి మూర్ఛలు పోయిన నా తొడల్ని తొడపాశం పెట్టినా, విశ్రాంతిగా వుండే అని వాలిపోయిన వీపుపై మద్దెల మోతలు తెప్పించినా నీ కోసం నాకు నవ్వే రాదు. నేను నవ్వను.

మేడమ్ మంచినీళ్లు తాగుతారా? రిసెప్షనిస్ట్ అడుగుతోంది.

దాహంగా వుందన్న విషయం తట్టింది సృజనకు. బాయ్ ట్రేలో చల్లని నీళ్ళగ్లాసు పట్టుకొచ్చాడు. సృజన గబగబా తాగింది. చున్నీ మీదకు నీళ్ళు జారాయి. సర్దుకొని అటూ యిటూ చూసింది సృజన. అలవాటైన దొంగ చూపు. ఎవ్వడూ చూడలేదు. తనను ఎవ్వరూ పనిగట్టుకు గమనించటం లేదు. ఇప్పుడు గ్లాసులో నీళ్ళు తాపీగా ఒక్కో చుక్క తాగుతోంది సృజన.

హలో సృజనా... హౌ ఆర్‌యు.

ఒక కేకతో పాటు... మనిషి.

ఎన్నేళ్ళయింది సృజనా? ఇక్కడే వుంటున్నావా? ఇప్పుడేవిటీ?

శివశంకరి నవ్వుతూ అడుగుతోంది.

సృజన హాయ్ అంది. సమాధానాలు చెపుతోంది గానీ.... మనసులోంచి మాత్రం సందేహాల వరదలు... 'ఇదీ ఉద్యోగం కోసమే వచ్చిందా? పోష్‌గా వుంది. తనకంటే గ్రాండ్‌గా వుంది. ఇంగ్లీష్ యాక్సెంట్ బావుంది. ఈ ఉద్యోగం ఇది తన్నుకు పోదు కదా!

'జస్టేమినిట్' శివశంకరి రిసెప్షనిస్ట్ దగ్గరికి వెళ్ళింది.

సృజన కళ్ళు సముద్రం పెయింటింగ్ పైకి మళ్ళాయి.

ఎగిరే బంగారు చేప పిల్లలు ఒక్కొక్కటి ఊపిరందక కిందికి రాలిపోతున్నాయి. 'అమ్మో నా చేపలు, నా బంగారు బుల్లి బుల్లి చేపలు. కలలో ఉత్సాహపు అమృతం పేల్చిన చేపలు చివరికీ తిమింగలం శివశంకరి వలలో పడదు కదా. మంచి డ్రెస్, మొహంలో ఫ్రెష్‌నెస్, పెళ్ళికాని పిల్ల, వళ్ళు చూస్తే తెలీటంలా! సరిగ్గా రొమ్ముల పైకి పట్టీల్లో అద్దాలు కుట్టిన చోళీ లోంచి అందమైన అద్భుతమైన శరీరం 'అందమైన రిసెప్షనిస్ట్‌ని ఎంచుకొనే బాస్ అందమైన ఆఫీస్ ఇన్‌ఛార్జిని కోరుకోడా!'

సృజన మొహం చేత్తో తడుముకొంది. దొంగ మొహం కళ్ళు వచ్చాయేమో.

గోళ్ళు గబగబా కొరుకుతున్నట్లు తెలుస్తోంది. సృజన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ నీళ్ళ కళ్ళతోనే సముద్రం వంక చూసింది. ఏ అలలూ లేవు. నురగలు లేవు. ఎగసిన అల అలాగే అతుక్కుపోయింది. ఈ సముద్రం ప్రవహించే సముద్రం కాదు. బంగారు చేపలు అందులోంచి ఎగిరిపడవు. తిమింగలం వేటకు సమయం ఇది కాదు.

సృజన చుట్టూ చూసింది. శంకరి ఇంకా మాట్లాడుతూనే వుంది. టేబుల్ పైన వంగి మాట్లాడుతోంది. రంగుల ఇంద్రధనుస్సు వంగినట్లుంది. ఇద్దరం కలసి ఆరేళ్ళు చదివాం. ఇప్పుడీ శంకరి తన స్నేహితురాలు అనుకొన్న ఆనందం రాలేదు. ఊరికే చూస్తూ వుంది సృజన బ్యాగ్ ఒకసారి చేత్తో తడుముకొంది. పొద్దున్నే కత్తిరించి దాచిన వాక్ ఇన్ ఇంటర్వ్యూల బొత్తి తగిలింది.

'పోనీ – ఈ తిమింగలం తగలకపోతే పోనీ రేపటి వేటలో చూద్దాం. ఇవాల్టికి శ్రమ వద్దు. తను ఏడవద్దు. దొంగమొహం తన కళ్ళలోంచి తొంగి చూడకూడదు. గోళ్ళు కొరుక్కోకూడదు. సృజన స్థిమితంగా కూర్చుంది. మనసు ప్రశాంతంగా వుందా? సముద్రపు హోరు వుందా, లేదా! ఇదంతా ఎ.సి. మిషన్ సౌండ్ అంతే! ఎదురుగ్గా శంకరి నా దోస్తే.... నేను నవ్వుతూ పలకరించగలనా?

'అన్నట్లు ఇదిగోనే సృజనా నా ఫోన్ నెంబర్, నా ఫ్రెండ్ ఇక్కడే పనిచేస్తోంది. ఆ పిల్లని ఇవ్వాళ అర్జంటుగా కలవాలి. పోతే నీతో చాలా చాలా మాట్లాడాలి. అన్నట్లు మన ఫ్రెండ్స్ చాలా మంది టౌన్‌లో వున్నారు తెల్సా. నేనైదెంటిపై చేశా. రాత్రికి ఫోన్ చేయవోయ్.

యవ్వనపు ప్రతిమ నడుచుకొంటూ వెళ్ళిపోయింది. సృజన గుండె జల్లుమంది. అయ్యో, ఇది ఉద్యోగం కోసం రాలేదా? నేను నవ్వనే లేదే.... దాన్ని ప్రేమగా చూడనే లేదే. మీసాలు తలుపు తెరిచి శంకరికి సెల్యూట్ కొట్టి తలుపేశాడు.

సృజన దొంగ దొంగగా చుట్టూ చూసింది. మళ్ళీ గోడవైపు చూపు మళ్ళింది. అది బొమ్మ సముద్రం కాదా?

సముద్రం ఒక్కసారి ఊగి ఒక్క దూకు దూకింది సృజన గుండెల్లోంచి... పోటెత్తిన సముద్రం వెర్రెత్తి... ఎగిసి....

సృజన కళ్ళప్పగించి చూస్తోంది.

మనసులోంచి సముద్రం హోరులోంచి తిమింగలం పడుతుందా? పడదా? ఈ వేట ముగుస్తుందా?!! ❋

*'గమనం', 2002*